క్లుప్తంగా

ప్రభుత్వ కళాశాలతోనే ఉజ్వల భవిష్యత్తు



వీర్లగుడి దళితవాడలో విద్యార్థులకు అడ్మిషన్లు చేస్తున్న అధ్యాపకులు

పాలసముద్రం : ప్రభుత్వ కళాశాలలతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని కళాశాల ప్రిన్సిపల్ హేమలత పేర్కొన్నారు. మంగళవారం అధ్యాపకులు రెండు బృందాలుగా విడిపోయి పాలసముద్రం, వీర్లగుడి దళితవాడలో పదో తరగతి పరీక్ష రాసిన విద్యార్థుల తల్లిదండ్రులతో అధ్యాపకులు మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని, అడ్మిషన్ ఫీజు తప్ప ఇతర ఫీజులు చెల్లించాల్సిన పనిలేదన్నారు. విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీతో ఆదాయం



అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ విద్యావతి, మండల విస్తరణాధికారి రమేష్

పాలసముద్రం : చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలని మండలాభివృద్ధి అధికారి విద్యావతి తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయం, చెత్త సేకరణ కేంద్రాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎంపీడీఓ విద్యావతి మాట్లాడుతూ.. చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్ బాబు, మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



కార్వేటినగరం: పాదిరికుప్పం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని హెచ్ఎం లీలావతి ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకున్నారు.

పాలసముద్రం : ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు క్రమ శిక్షణతో కూడిన విద్యను నేర్చుకుంటే ఉన్నతంగా రాణిస్తారని శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్ బాబు తెలిపారు. మంగళవారం శ్రీకావేరి రాజుపురం ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్ఎం శ్యామలమ్మ సమక్షంలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో శ్రీబొమ్మరాజుపురం హెచ్ఎం వెంకటేష్, కార్యదర్శి సత్యనారాయణ, సీఆర్పీ రాజేశ్వరి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ మృతికి నివాళి



రాజారెడ్డి (ఫైల్)

గంగాధర్ నెల్లూరు : గంగాధర్ నెల్లూరు మండలంలోని ఎట్టేరి గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ రాజారెడ్డి(90) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఇన్‌చార్జి నూకతోటి రాజేష్, పార్టీ సీనియర్ నాయకులు ఆనగంటి హరికృష్ణ , మండల నాయకులు, కార్యకర్తలు మాజీ ఎంపీపీ రాజారెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాణసంచా గోడౌన్ల తనిఖీ



బాణసంచా గోడౌన్లను తనిఖీ చేస్తున్న పోలీస్ అధికారులు

కార్వేటినగరం : మండల పరిధిలోని బాణసంచా గోడౌన్లపై సీఐ హనుమంతప్ప, తహసీల్దార్ నాగరాజు, నగరి అగ్నిమాపక ఎస్ఐ సుబ్బరాజు, స్థానిక ఎస్ఐ రాజీకుమార్ తనిఖీలు నిర్వహించారు. దుకాణాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం సీఐ హనుమంతప్ప మాట్లాడుతూ.. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తగా ఉండాలని, ప్రతి గోడౌన్ వద్ద అగ్నిమాపక శాఖ నిబంధనలను తప్పక పాటించాలని ఆదేశించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పుత్తూరు లేబర్ అధికారి హేమాచారి, షాపు యజమానులు ఉన్నారు.

ఉపాధికి దగ్గరి దారి

మాజీ మంత్రి ఆర్కే రోజా పట్టుదలకు, రాజకీయ శక్తి సామర్థ్యాలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన పుత్తూరులోని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నేడు ఎంతో మంది విద్యార్థులకు చేయూతనిస్తోంది. వారి బంగారు భవిష్యత్‌కు పునాదులు వేస్తోంది. ప్రస్తుతం ఇదే కళాశాలలో వంద మందికి పైగా పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు పాలిసెట్‌కు సన్నద్ధం అవుతున్నారు. వీరందరికీ ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇవ్వడంతో పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇలా శిక్షణ పొందుతున్న విద్యార్థులు ఈనెల 30 పాలిసెట్ రాయనున్నారు.

పుత్తూరు కళాశాలలో ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులు



- పాలిటెక్నిక్ వైపు విద్యార్థుల చూపు
- భవితకు భరోసానిస్తున్న పుత్తూరు పాలిటెక్నిక్ కళాశాల
- మాజీ మంత్రి ఆర్కే రోజా కృషి ఫలితం
- ఈ నెల 30న పాలిసెట్

పుత్తూరు: పదో తరగతి పూర్తి చేసుకున్న పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులందరూ సాంకేతిక విద్యా కోర్సుల పట్ల మొగ్గు చూపుతున్నారు. ఇందుకు తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను ప్రోత్సహిస్తుండడం శుభపరిణామం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో మాజీ మంత్రి ఆర్కే రోజా పుత్తూరులో ఏర్పాటు చేసిన పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల తల్లిదండ్రులు, విద్యార్థుల ఆశలు, ఆశయ సాధనకు వేదికగా నిలుస్తుండడం విశేషం.



పుత్తూరు పాలిటెక్నిక్ కళాశాల

ఈ నెల 30న ప్రవేశ పరీక్ష

రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 30న పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారు. పదవ తరగతి పూర్తి చేసి, ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నారు. ఇందుకు గాను వివిధ ప్రాంతాల్లో శిక్షణ పొందుతున్నారు. ఈ ప్రవేశ పరీక్షలో గణితం, భౌతిక, రసాయన సబ్జెక్టులకు సంబంధించి మొత్తం 120 మార్కులకు ప్రశ్నపత్రం ఇవ్వనున్నారు. ప్రవేశ పరీక్ష ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆబ్జెక్టివ్ విధానంలో వివిధ పాలిటెక్నిక్ కేంద్రాల్లో పరీక్ష నిర్వహించనున్నారు. తిరుపతి ఎస్వీజీపీ పాలిటెక్నిక్ కళాశాల, పద్మావతి ఉమెన్స్ కళాశాల, గూడూరు, సత్యవేడు, చిత్తూరు జిల్లాలో చిత్తూరు, పలమనేరు, కుప్పం, మదనపల్లి, కలికిరిలో కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఉన్నత చదువుల కోసం..



మా కుటుంబం వ్యవసాయం మీద ఆధారపడి ఉంది. నేను ఉద్యోగం చేసుకుంటూ ఉన్నత చదువులు చదవాలని భావిస్తున్నాను. త్వరగా ఉద్యోగం సంపాదించాలంటే పాలిటెక్నిక్‌ను ఎంచుకున్నాను. అందుకే పాలిసెట్‌కు సన్నద్ధం అవుతున్నాను. పుత్తూరులో కళాశాల ఉండడం నా అదృష్టంగా భావిస్తున్నా. –తరుణ్, విద్యార్థి, పుత్తూరు.

త్వరగా స్థిరపడాలని..



మాది మధ్య తరగతి కుటుంబం. పదవ తరగతి తర్వాత త్వరగా స్థిరపడాలంటే పాలిటెక్నిక్ సరైందని గుర్తించాను. అందుకే పాలిటెక్నిక్‌లో జాయిన్ అవడానికి ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నాను.
– మానస, నేసనూరు, పుత్తూరు మండలం

క్యాంపస్ డ్రైవ్స్‌తో ఉద్యోగాలు



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కోర్సు పూర్తి అయిన వెంటనే క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహిస్తున్నాం. తద్వారా విద్యార్థులు ఉద్యోగాలు సాధించి, తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవడానికి వీలుకలుగుతోంది. అందుకే సాంకేతిక విద్యపై మొగ్గు చూపుతున్నారు.
–ఎస్వీ కుమార్, ప్రిన్సిపల్, పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ కళాశాల, పుత్తూరు

జగనన్నకు రుణపడి ఉంటాం



జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మాహిన్

నగరి : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కోర్టు ద్వారా చేస్తున్న పోరాటానికి తాము ఎప్పుడూ రుణపడి ఉంటాం అని ఆ పార్టీ రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి మాహిన్ తెలిపారు. పుత్తూరు పట్టణానికి చెందిన ముస్లింలు మాజీ మంత్రి ఆర్కేరోజా ఆధ్వర్యంలో తాడేపల్లి క్యాంప్ ఆఫీసుకు వెళ్లి పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్ రెడ్డిని కలిసినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని తమకు బాసటగా నిలిచినందుకు ఎప్పుడూ రుణపడి ఉంటామని ఆయనకు కృతజ్ఞతలు తెలిపామన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

వడమాలపేట : మండలంలో గురువారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన





నగరి : ర్యాలీలో సీడీపీవో, కమిషనర్, ఎంపీడీవో, కార్వేటినగరం: పోషణ కార్యక్రమంలో అధికారులు

కార్వేటినగరం : పౌష్టికాహారంతో రక్తహీనతను అరికట్టవచ్చని సీడీపీఓ పద్మసునంద పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పోషణ్ పక్వాడ్ కార్యక్రమంపై అవగాహన కల్పించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు ఇందిరా, షామినీ, వ్యవసాయాధికారిణి హేమలత, ఏపీఎం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

నగరి : పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సీడీపీవో కృష్ణవేణి, మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో కృష్ణయ్య తెలిపారు. పోషణ్ పఖ్వాడ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మున్సిపల్ పరిధిలో వారు ర్యాలీ నిర్వహించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, పారిశుద్యం పాటించాలని, ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ నగరి ఐసీడీఎస్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లులకు వివిధ కార్యాక్రమాల ద్వారా పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, తల్లులు పౌష్టికాహారం తీసుకుంటే వారితో పాటు భావితరాలు ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎస్.శంకరమ్మ, టి.లక్ష్మి, బీపీసీ గోపీనాథ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలోనే నాణ్యమైన విద్య



నగరి : ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య సాధ్యమని బాలికల ఉన్నత పాఠశాల (ప్లస్) హెచ్ఎం గాయత్రీదేవి పేర్కొన్నారు. మంగళవారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం పెద్ద దళితవాడలోని ప్రభుత్వ పాఠశాలలోని వసతులను పిల్లల తల్లిదండ్రులకు వివరిస్తూ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులను చేర్పించి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని అభ్యర్థించారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేద్దామనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్, బంగారమ్మ, శాంతి, భానుమతి, సరిత, గీత, భారతి, మునింద్ర, రవి, శ్రీనివాసులు, కన్నయ్య, శశికపూర్, వేణుగోపాల్‌రెడ్డి, చిత్ర,కస్తూరి, లీనాకుమారి, విజయలక్ష్మి, వరలక్ష్మి, పీడీ మురళీకృష్ణరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నగరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. మండలంలోని ఎం.కొత్తూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మంగళవారం గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోని వసతులను తెలిపే కరపత్రాలను పంపిణీ చేశారు. నాణ్యమైన విద్యా బోధనలు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, యూనిఫాం ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుందన్నారు. గ్రామంలోనే స్థానికంగా చదవడం వల్ల ఉపాధ్యాయులు కూడా అందుబాటులో ఉండి విద్యార్థులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్వేటినగరం: ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

బోదకాలు నివారణకు మందుల పంపిణీ

నింద్ర: మండలంలోని పలుగ్రామాల్లో బోదకాల రోగులను గుర్తించి వారికి మంగళవారం మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి వినీషా మట్లాడుతూ బోదకాలు వున్న వారు మందులు వాడడం వలన వ్యాధి నయమవుతుందని చెప్పారు. వైద్యాధికారుల సూచనలు పాటించాలని కోరారు. మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యానిట్ ఆధికారి శివమణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ కాలనీలో డీఎస్పీ పల్లెనిద్ర



గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ

నింద్ర: మండలంలోని వేదాంతపురం ఎస్టీకాలనీలో నగరి డీఎస్పీ సయ్యద్ అబ్దుల్ అజీజ్ మంగళవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కార కోసమే పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామస్తులతో పలు సమస్యలపై ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నగరి రూరల్ సీఐ భాస్కర్, ఏఎస్ఐ గోవిందరాజులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధునికి లక్ష విరాళం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం నిత్య అన్నదాన ట్రస్టుకు మంగళవారం రూ.లక్ష విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన దాత చంద్రారెడ్డి రూ. లక్ష విరాళంగా ఇచ్చారు. ఆలయ సిబ్బంది కోదండపాణి ఆ నగదును అందుకుని విరాళం ఖాతాకు జమ చేశారు. అనంతరం దాత కుటుంబానికి ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు. పండితుల ఆశీర్వచనాలు, ప్రసాదం అందజేశారు.

అనధికార చేపల వేట!



తొరూరు చెరువు

పుత్తూరు: మండల పరిధిలోని తొరూరు చెరువుకు సంబంధించి ఎలాంటి వేలం పాటలు నిర్వహించకనే కొందరు వ్యక్తులు చెరువులోకి అనధికారికంగా చేప పిల్లలను వదిలిపెట్టారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రెండు రోజులుగా చేపలను సైతం పట్టేస్తున్నారని స్పష్టం చేశారు. పంచాయతీకి అందాల్సిన ఆదాయం అందకుండా, అక్రమ చేపల వేట జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జూన్‌లో వేలం పాటలు నిర్వహించడం వల్ల ఉపయోగం లేదని తేల్చి చెబుతున్నారు. ముందస్తుగా బహిరంగ వేలం పాటలు నిర్వహించి గ్రామ పంచాయతీకి నిధులు చేకూరేలా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేలం పాటలు నిర్వహిస్తాం

వాస్తవంగా జూన్‌లో పసలి నిర్వహించాల్సి ఉంది. అయితే తీవ్ర స్థాయిలో ఉష్ణోగ్రతలు ఉన్న కారణంగా చెరువులో నీటి మట్టం అడుగంటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెలలోనే వేలం పాటలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నాం. అనుమతి వచ్చిన వెంటనే బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తాం. అనధికారికంగా చేప పిల్లలను ఎవరూ చెరువులో వదలేదు.
– రాము, కార్యదర్శి, తొరూరు.

ఆకు కూరల్లోనే అధిక పోషకాలు

శ్రీరంగరాజపురం : ఆకు కూరల్లో పోషకాలు అధికంగా ఉంటాయని పర్యవేక్షకురాలు భారతి అన్నారు. మంగళవారం సీకే పురం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. బాలింతలు, రెండేళ్ల లోపు పిల్లలకు తీసుకోవాల్సిన వెయ్యి రోజుల సంరక్షణను వివరించారు. అదే విధంగా స్థానికంగా తక్కువ ధరలకే అందుబాటులో ఉండే ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాలు ఎక్కువగా వినియోగించడం వల్ల రక్తహీనత దూరమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.



పోషకాహారాల ప్రదర్శనలో అంగన్‌వాడీలు

ప్రసన్నుడి కల్యాణ వైభోగం

శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుని కల్యాణ ఉత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



వడమాలపేట (విజయపురం) : వడమాలపేట మండలం అప్పలాయిగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవం వైభవంగా సాగింది. స్వామి అమ్మవార్లకు నిత్యం తిరు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా వేద పండితుల మంత్రోచ్చారణలు, వేద పారాయణాలు, మంగళ వాయిద్యాల మధ్య సాగింది. అర్చకులు వేద పండితులు ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు నిర్వహించారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామిని ఆరాధిస్తూ వందల సంఖ్యలో పాల్గొన్నారు.

మా ఇష్టం... మా ప్రభుత్వం



విజయపురం మండలం పన్నూరు సచివాలయం సమీపంలో ఓ టీడీపీ నాయకుడు పొలం మధ్యలో సిమెంట్ రోడ్డు వేశారు. అక్కడ ఎలాంటి ఇల్లు, ప్రభుత్వం భవనం, పాఠశాలలు లేవు. కేవలం తన స్వార్థం కోసమే సిమెంట్ రోడ్డు వేసుకున్నారు. అందుకోసం మండల, జిల్లా స్థాయి అధికారులు సుమారు రూ.2లక్షల బిల్లు మంజూరు చేయడం గమనార్హం. మా ఇష్టం ...మా ప్రభుత్వం అంటూ టీడీపీ నాయకులు చెలరేగిపోతున్నారు. ప్రజాధనాన్ని ఓ టీడీపీ నాయకుడి సొంతానికి వినియోగించుకోవడం చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- విజయపురం